అసాంఘిక కార్యకలాపాలకు నెలవు

చీకటి పడితే చాలు ఆ ప్రాంతాలు మందుబాబులకు, ఆకతాయిలకు నెలవుగా మారుతున్నాయి. పొద్దు వాలింది మొదలు, మధ్య రాత్రి, కొన్ని సార్లు తెల్లవార్లూ ఇక్కడే ఉంటూ మద్యం, గంజాయి వంటివి సేవిస్తుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులవుతున్నారు. ఇదంతా జరుగుతున్నది ఎక్కడో శివారు ప్రాంతాల్లో కాదు.. నగరం నడిమధ్య ఉన్న రైల్వే న్యూకాలనీ పరిసర ప్రాంతంలోనే. వీరి చేష్టలతో సమీప క్వార్టర్స్‌లో నివసించేవారు, ఆ మార్గంలో ప్రయాణించేవారు, సమీపంలోని ఆలయానికి వచ్చే భక్తులు హడలిపోతున్నారు.

- నిర్మానుష్యంగా రైల్వే క్వార్టర్స్
- అడ్డాగా మార్చుకున్న మందుబాబులు, గంజాయి బ్యాచ్
- ఆకతాయి చేష్టలతో స్థానికుల్లో ఆందోళన
- రాత్రయితే అటు వైపు వెళ్లాలన్నా భయం


అస్తవ్యస్తంగా ఉన్న ప్రాంతం


నిర్మానుష్యంగా ఉన్న రైల్వే క్వార్టర్స్


మందుబాబులకు వేదికైన ఓపెన్ గ్రౌండ్, ఖాళీ స్థలం


చెట్లు కింద తాగి పడేసిన బీరు, మద్యం బాటిల్స్

తాటిచెట్లపాలెం: రైల్వేన్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా, షిర్డీ సాయిబాబా ధ్యానమందిరం పక్కనే సింహగిరి కాలనీ రైల్వే క్వార్టర్స్ ఉన్నాయి. ఈ క్వార్టర్స్‌ను గతంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ క్వార్టర్స్‌గా పిలిచేవారు. అయితే ధ్యానమందిరం పక్కనే రోడ్డుకిరువైపులా గల ఈ క్వార్టర్స్‌లో ఎవరూ నివసించకపోవడంతో సుమారు 24 బ్లాకులు ఖాళీగా, శిథిలావస్థలో ఉన్నాయి. ఈ క్వార్టర్స్‌ను అనుకుని ఖాళీ స్థలం కూడా ఉంది. చాలాకాలంగా ఇవి ఖాళీగా ఉండటంతో ఈ ప్రాంతాలను మందుబాబులు, గంజాయి బ్యాచ్ అడ్డాగా మార్చుకున్నాయి. ఈ క్వార్టర్స్‌లో, చెట్ల కింద మద్యం సేవిస్తూ సమీప ప్రాంతవాసులకు ఇబ్బంది కలుగజేస్తున్నారు. వీరిని చూసి భయపడి కొన్నిసార్లు ఎన్ని పనులున్నా ఈ మార్గంలో రాలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. రాత్రంతా ఇక్కడే మద్యం సేవించడం, అల్లర్లు చేయడం వంటివి వారికి నిత్యకృత్యంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్నిసార్లు ఈ పాడుబడిన క్వార్టర్స్‌లో మద్యం సేవించి ఆ బాటిల్స్‌ను ధ్యానమందిరం ప్రాంగణంలోకి విసిరేస్తున్నారు. ఇటీవల ఈ గంజాయి బ్యాచ్ మధ్య రాత్రి నుంచి తెల్లవారే వరకు ధ్యానమందిరం పరిసరాల్లో తిరుగుతూ మద్యం, గంజాయి సేవిస్తూ ఇక్కడ ఉన్న వాచ్‌మన్‌ను పరుగులెత్తించడం, కొట్టడం చేశారని ధ్యానమందిరం నిర్వాహకులు తెలిపారు. ఈ విషయమై పోలీసులు కూడా విచారించినట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు స్పందించి ఆకతాయిల ఆగడాలు అరికట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రక్షణ కల్పించండి

రాత్రివేళల్లో రైల్వే క్వార్టర్ల వద్ద చాలామంది చేరుతున్నారు. గంజాయి, మద్యం సేవిస్తూ అటుగా వెళ్లేవారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ దారిన రావాలంటేనే భయమేస్తోంది. మత్తులో వీరేం చేస్తున్నారో కూడా తెలియని స్థితిలో ఉంటున్నారు. మాకు రక్షణ కల్పించండి.
రామలక్ష్మి, రైల్వేన్యూకాలనీ

ఆగడాలు సహించలేకపోతున్నాం

క్వార్టర్స్‌లో ఉన్న పెద్ద చెట్టు కింద కూర్చుని బహిరంగంగా మద్యం సేవిస్తూ, అల్లర్లు చేస్తున్నారు. ఈ పరిసర ప్రాంతాల్లో దొంగతనాలు కూడా జరుగుతున్నాయి. మధ్యరాత్రి వేళల్లో పాడైన క్వార్టర్స్‌లో చేరి తెల్లవారే వరకు ఇక్కడే ఉంటున్నారు. ఈ మందుబాబుల, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలు సహించలేకున్నాం.
రాంబాబు, రైల్వే న్యూకాలనీ

మందిరాన్ని అపవిత్రం చేస్తున్నారు

గంజాయి బ్యాచ్, మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయి. ఈ మధ్య మా ధ్యానమందిరానికి చెందిన పెద్ద ఇనుప నిచ్చెన దొంగిలించేందుకు ప్రయత్నించి విఫలమై, కాలువలో పడేశారు. గత వారంలో మా సెక్యూరిటీ గార్డ్‌ను భయపెట్టారు, కొట్టారు. రాత్రంతా ఈ పక్క క్వార్టర్స్‌లోనే ఉంటూ మద్యం సేవించడమే కాకుండా పవిత్రమైన ఆలయ పరిసరాల్లోకి ఆ బాటిల్స్ విసిరేస్తున్నారు. వీరి చేష్టలతో భక్తులు సైతం భయపడిపోతున్నారు.
– శేషగిరిరావు, షిర్డీ సాయిబాబా ధ్యానమందిరం

సనాతన ధర్మ పరిరక్షణకే హైందవ శంఖారావం


మాట్లాడుతున్న బాజ్జీ

సీతమ్మధార: సనాతన ధర్మ పరిరక్షణకే హైందవ శంఖారావం నిర్వహిస్తున్నామని కార్యక్రమ కన్వీనర్ అన్నే బాజ్జీ అన్నారు. ప్రభుత్వ ఆధీనం నుంచి దేవాలయాలను, హిందూ ధార్మిక సంస్థలను విముక్తి చేయాలన్న విశ్వహిందూ పరిషత్ పిలుపు మేరకు జనవరి 5న విజయవాడలో జరగనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. గురుద్వారాలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైందవ శంఖారావం సభకు విశాఖ నుంచి 82 బస్సులు, వందల సంఖ్యలో కార్లు, 3 ప్రత్యేక ట్రైన్ల ద్వారా వేల మంది వెళ్తున్నారన్నారు. మీడియా సమావేశంలో వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు ఆచార్య కందర్ప విశ్వనాథ్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్ సుధాకర్

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఆఫీసర్ అసోసియేషన్ (విశాఖపట్నం జిల్లా విభాగం) ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర ఆఫీస్ టేబుల్ క్యాలెండర్‌ను సీతమ్మధారలోని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. విశాఖ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ కె. జాన్ సుధాకర్ దీనిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్, ఏపీటీవోఏ జిల్లా ప్రెసిడెంట్ ఎం.ఏ.ఖాదర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: తెలుగునాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం 2025 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం జరిగింది. విభాగం రీజనల్ డైరెక్టర్ రాధారాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి అధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

క్లుప్తంగా

12న యూత్ మారథాన్

మురళీనగర్: స్వామి వివేకానందుడి జయంతి సందర్భంగా ఈ నెల 12న మారథాన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పి.శ్రీనివాస్ తెలిపారు. స్వామి వివేకానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 5.30గంటలకు 5కే రన్ నిర్వహిస్తామన్నారు. గాజువాక డిపో సమీపంలోని స్వామి వివేకానంద విగ్రహం నుంచి మల్కాపురం వరకు యూత్ రన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ రన్‌లో పాల్గొనే వారికి టీ-షర్ట్, మెడల్, గూగుల్ బ్యాగ్ విత్ గూడీ ఐటమ్స్, ఆన్ రోడ్ రిఫ్రెష్‌మెంట్స్, ఉదయం టిఫిన్ అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు https://youthmarathon2025.fun లింక్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

12 మంది జూదరుల అరెస్టు

సీతమ్మధార: సీతమ్మధారలో బహిరంగ ప్రదేశంలో జూదం ఆడుతున్న వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి నాలుగో పట్టణ పోలీసులకు శుక్రవారం అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. సీతమ్మధార రాధాకృష్ణ లేఅవుట్ వద్ద గల ధారకొండ ప్రాంతంలో ఒక ఫిర్యాదుదారుడు ఇచ్చిన సమాచారం మేరకు, సిటీ టాస్క్ ఫోర్స్ సిబ్బంది దాడులు చేసి 13 మంది జూదగాళ్లను అరెస్టు చేశారు. నిందితులంతా కూలిపనులు చేస్తూ, జీవనం సాగిస్తున్నవారే. వారి నుంచి రూ.31,100 స్వాధీనం చేసుకున్నారు. వారిలో సీతమ్మపేటకు చెందిన ఒకరు పరారయ్యాడని పోలీసులు తెలిపారు. నాలుగో పట్టణ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన


చిన్నారుల ఆరోగ్య కార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు అల్లూరి సీతారామరాజు నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని వైద్యులు శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ డి.సాయికిరణ్, ఏఎస్ఆర్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కేపీ నాయుడు సందర్శించారు. 281, 282, 283 సచివాలయాల పరిధిలోని చిన్నారుల వివరాలు, ఆరోగ్య కార్డులను పరిశీలించారు. వారికి అందిస్తున్న సంపూర్ణ ఆహారం మెనూ అమలును పరిశీలించి, పలు సూచనలు చేశారు. చిన్నారుల బరువు, బీటింగ్ సామర్థ్యం, ఫీవర్, దగ్గు, మాల్ న్యూట్రిషన్, పీహెచ్ సమస్యలను నమోదు చేశారు. రాష్ట్రీయ ఆరోగ్య కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అంగన్‌వాడీ టీచర్, ఆయాలకు సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం బి.దివ్య రేవతి, ఆశ వర్కర్ జి.ప్రసన్న కుమారి, అంగన్‌వాడీ టీచర్ సీహెచ్ సింహాచలమ్మ పాల్గొన్నారు.

22ఏ భూ సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు


సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: సీతమ్మధారలోని 22ఏ భూముల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెలిపారు. జీవీఎంసీ 25, 14 వార్డులకు సంబంధించి బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని కల్యాణమండపంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సదస్సులో 22 ఏ భూములకు సంబంధించిన పలు సమస్యలు, ఇళ్ల పట్టాల విషయమై వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతమ్మధార , సీతంపేట ప్రాంతాలలో ఎక్కువగా ఉన్న 22ఏ భూముల సమస్య విషయంపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి, ప్రత్యేక జీవో తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. సదస్సులో తహసీల్దార్ ఎం.రమేష్ 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్, జనసేన ఉత్తర సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్, టీడీపీ 14వ వార్డు అధ్యక్షుడు గొంప ధర్మారావు, ఆర్ఐ ప్రేమలత, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యాజ్యోతి సావిత్రిబాయి పూలే

- ఉమ్మడి విశాఖ గురుకుల ఎడ్యుకేషనల్ సొసైటీ కో–ఆర్డినేటర్ రూపావతి
- ఘనంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం


సావిత్రిబాయి పూలేకు నివాళులు అర్పిస్తున్న గొల్లమాల అప్పారావు, దళిత నాయకులు

కంచరపాలెం: మహిళలు కట్టు బానిసలుగా జీవిస్తున్న తరంలో క్రాంతి జ్యోతిగా వెలుగొంది, మహిళల హక్కుల ప్రదాతగా సావిత్రిబాయి పూలే నిలిచారని ఉమ్మడి విశాఖ జిల్లాల గురుకుల ఎడ్యుకేషనల్ సొసైటీ సమన్వయకర్త ఎస్.రూపావతి అన్నారు. కంచరపాలెం పరిధి సంస్థ కార్యాలయంలో అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ (యాక్ట్) ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. స్త్రీల జీవితాల్లో విద్యా వెలుగులు నింపి, అన్నిరంగాల్లో అర్హులేనని చాటిచెప్పిన మహిళామూర్తి అని కొనియాడారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తాళ్లపాలెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జి.గ్రేస్, శ్రీకాకుళం జిల్లా కో–ఆర్డినేటర్ బాలాజీ నాయక్, యాక్ట్ ప్రతినిధులు పి.భీమ్‌రావ్, కె.కార్తీక్, ఎన్. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


అతిథులకు సావిత్రిబాయి చిత్రపటాలను అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం

మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిబాయి పూలే అని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు అన్నారు. ఆడపిల్లలు చదువుకోవాలని పోరాడిన మహనీయురాలని కొనియాడారు. ఊర్వశి కూడలి దళిత సేన కార్యాలయంలో దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు పిలుపు మేరకు సావిత్రి బాయి పూలే 194వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దళిత సేన నగర మహిళా కన్వీనర్ గొల్లమాల మీనా, కామేశ్వరరావు, ఝాన్సీరాణి, సీతారామ్, రాణి, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


సావిత్రిబాయి జయంతి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నేతలు

సావిత్రిబాయి సేవలు అపూర్వం

సీతమ్మధార: దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయినిగా సావిత్రిబాయి పూలే చరిత్రలో నిలిచిపోయారని బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక అన్నారు. సావిత్రిబాయి జయంతి సందర్భంగా సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ కప్పరాడ మండల అధ్యక్షుడు గునుపూడి అరుణ్‌బాబు, టీడీపీ 47వ వార్డు ఇన్‌చార్జి మోర్తా రాజారావు, బీజేపీ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి జామి శ్రీనివాస్, అక్కయ్యపాలెం మండల అధ్యక్షుడు గాదం నాగరాజు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగనాథుడికి పాశుర విన్నపం


లలితాపీఠంలో అమ్మవారికి నీరాజనం


గోదాదేవి అమ్మవారితో ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు


దీపాలతో నీరాజనం అర్పిస్తున్న భక్తులు

మురళీనగర్: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీరంగనాథుడికి భక్తులు పాశుర విన్నపం చేశారు. కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో స్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున 4గంటలకు ప్రాతఃకాలార్చన చేశారు. అనంతరం గోదాదేవిని మేళతాళాల మధ్య వేద మంత్రోచ్ఛరణలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణగా ఊరేగించారు. తిరుప్పావై సేవా కాలం, విశేష భోగం సమర్పించారు. గోదాదేవి తరపున శ్రీరంగనాథుడి కి 19వ పాశురాన్ని భక్తులు సామూహికంగా విన్నవించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

లలితాపీఠంలో దీప పాశురం

సీతంపేట: ధనుర్మాసోత్సవాలలో భాగంగా అక్కయ్యపాలెం శ్రీ లలితాపీఠంలో శుక్రవారం దీప పాశురం నిర్వహించారు. 19వ పాశురం కుత్తువిళక్కిరయ సందర్భంగా భక్తులు స్వామి వారికి దీప హారతి సమర్పించారు. సాయంత్రం పీఠం దర్బారు హాల్లోని శ్రీభూనీలా సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చురుగ్గా ఫ్లవర్ గార్డెన్ పనులు


హైవే ప్రక్కన గ్రీన్‌బెల్ట్‌లో జరుగుతున్న ఫ్లవర్ గార్డెన్ పనులు


గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు పరిధి జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో ఫ్లవర్ గార్డెన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హైవేకు ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని పార్కులు, ఓపెన్ జిమ్‌లతో అందంగా తీర్చిదిద్దారు. దానిలో భాగంగా పల్లవి అపార్టుమెంట్ సమీపంలో గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో ఫ్లవర్ గార్డెన్ పనులు కూడా ప్రారంభించారు. మధ్యలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు చాలాకాలం నిలిచిపోయాయి. మరలా కొద్ది రోజులుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వాకింగ్ ట్రాక్‌తో పాటు యోగా చేసేందుకు వీలుగా పార్కును అభివృద్ధి చేస్తున్నారు. కాలిబాటల్లో సిమెంట్ ఇటుకలు పేర్చారు. పాదాచారులు కూర్చునేందుకు సిమెంట్ బెంచీలు సిద్ధం చేశారు. మొక్కలు నాటేందుకు వీలుగా సిమెంట్ జాలీలతో మడులు సిద్ధం చేశారు. గార్డెన్‌లో గోడలకు వాల్ ఆర్ట్ పనులు ఆకట్టుకుంటున్నాయి. అపెక్స్ పెయింటింగ్‌తో చూడచక్కని చిత్రాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. అక్కయ్యపాలెం కూడలి నుంచి పోర్టు ఆస్పత్రి కూడలి వరకు ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆహ్లాదకరమైన పార్కులు, వాకింగ్ ట్రాక్‌లతో అభివృద్ధి చేసింది. ఆ పనుల్లో భాగంగా ఫ్లవర్ గార్డెన్ పనులు కూడా గత ప్రభుత్వం హయాంలో ప్రారంభించారు. ఫ్లవర్ గార్డెన్ పనులు కొనసాగుతుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా కల్వర్టు పనులు


అబిద్‌నగర్‌లో గెడ్డపై కల్వర్టుకు శ్లాబ్ వేస్తున్న సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు పరిధి అబిద్ నగర్ షాదీఖానా కల్యాణ మండపం పక్కన గల రహదారిలో బ్లాకు కల్వర్టు నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. ముస్లిం తాటిచెట్లపాలెంకు వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టు గోడలు బలహీనం అవడం, కొంత భాగం కుంగిపోవడంతో వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.19 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్, ప్రభుత్వం మారడంతో పనుల ప్రారంభంలో జాప్యం జరిగింది. ప్రస్తుతం పాత కల్వర్టు పూర్తిగా తొలగించారు. దాని స్థానంలో కొత్తగా బాక్సు కల్వర్టు నిర్మాణ పనులు కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. కల్వర్టుకు శ్లాబ్ పనులు పూర్తి అయ్యాయి. కల్వర్టుపై నుంచి రాకపోకలు సాగించేందుకు అప్రోచ్ రోడ్ పనులు జరగాల్సి ఉంది. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంరక్షకుల చెంతకు శ్రీకాకుళం మహిళ

సీతమ్మధార: పోలీసులు ఇచ్చిన సమాచారంతో 4వ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఆరాధన అనే మహిళను పట్టుకున్నట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు శుక్రవారం తెలిపారు. ఈమె ఖైనీ, గుట్కాలకు బాగా అలవాటు పడిందన్నారు. మూడు నెలలు షెల్టర్‌లో ఉంచి చికిత్స అందజేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు ఆమె సొంతూరు శ్రీకాకుళం తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అక్కడ గ్రామస్తులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఆమె తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోయారని, ఆమె గత 20 ఏళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతుందని తెలిపారు. ఆరేళ్ల పాటు విశాఖ ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో కూడా చికిత్స చేయించారని, భర్త వదిలేసి వెళ్లిపోయాడని, సోదరుడు పూర్తిగా మద్యానికి బానిస అయిపోయాడని తెలిపారు. ఆమె గ్రామంలో ఒంటరిదై తిరుగుతూ ఉంటే ఒక చర్చి పాస్టర్ చేరదీసి వైజాగ్‌లో ఉంటున్న సోదరి దగ్గరకు పంపించారని చెప్పారు. గ్రామస్తుల నుండి గార్డియన్ సత్యవతి నంబర్ తీసుకుని మళ్లీ విశాఖలో ఈమెను అప్పగించినట్లు తెలిపారు.

'కార్మికుల పొట్ట కొట్టొద్దు'

సీతమ్మధార: ముందస్తు నోటీసు ఇవ్వకుండా, నోటి మాటతో అర్ధంతరంగా జీవీఎంసీ కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ కార్మికులను నిలుపుదల చేయడం అన్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీస్ కింద చట్ట విరుద్ధం అని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. గాంధీ పార్క్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు మాట్లాడుతూ మరణించిన లేదా పదవీ విరమణ చేసిన కార్మికుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పర్మినెంట్ ఉద్యోగులకు 58 ఏళ్ల రిటైర్మెంట్ వయసు ఉన్నప్పుడు కాంట్రాక్టు/ఔట్ సోర్సింగ్ కార్మికులకు 58 సంవత్సరాలు అమలు చేశారని అన్నారు. 2025 జనవరి ఒకటి నుండి 60 సంవత్సరాలు పూర్తి అయ్యాయని కొంత మంది కార్మికులను నిలిపివేయడం సరైనది కాదన్నారు. పెరుగుతున్న జనాభా ఆధారంగా కార్మికుల పెరుగుదల లేదన్నారు. అర్ధంతరంగా నిలిపివేసిన పారిశుధ్యం, నీటి సరఫరా, ఇతర విభాగాల కార్మికులను తిరిగి కొనసాగించాలని జీవీఎంసీ కమిషనర్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నాలో గౌరవ అధ్యక్షుడు పి. వెంకటరెడ్డి, అధ్యక్షుడు టి. నూకరాజు, గొలగాని అప్పారావు, ముద్దాడ ప్రసాద్, జేఆర్ నాయుడు, ఒమ్మి అప్పారావు, గణేష్, ఈశ్వరరావు, సీర రమణ, వెంకట్రావు, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.